Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

ప్రభాత
వెలుగు లైఫ్
సోమవారం
06. 22.04.2019
www.v6velugu.com

కౌన్సెలింగ్

‘స్నేహం చేయడం సులభం.. నిలబెట్టుకోవడం కష్టం’. ‘నమ్మడం సులభం.. నమ్మించడం కష్టం’ ఈ రెండు కొటేషన్స్ మధ్య చిన్న లింక్ ఉంది. స్నేహం చేయాలంటే ఏమీ అక్కర్లేకపోవచ్చు. కానీ, దాన్ని నిలబెట్టుకోవాలంటే మాత్రం నమ్మకం అవసరం. అపోహలు, అభిప్రాయ భేదాలు వస్తే నమ్మకమే స్నేహితుల్ని తిరిగి కలుపుతుంది. మరి ఈ రోజుల్లో కూడా మంచి స్నేహితులు ఉన్నారు అంటే ఆ గొప్పతనం వాళ్ల మధ్య ఉన్న నమ్మకానిది. మరి ఇద్దరి మధ్యా నమ్మకం కలగాలంటే..



# బెస్ట్ ఫ్రెండ్స్ అంటే..!?

**స్నేహ సంపదను** మించిన బంధం.. జీవితానికి భరోసా అలాంటిది. తల్లిదండ్రుల తర్వాత అంతకు మించిన స్థానాన్ని స్నేహితులకే ఇస్తారు. మరి అలాంటి స్నేహాలు కలకాలం మనిషికి తోడుగా, అండగా ఉండాలంటే అంత సులభం కాదు. స్కూల్ స్నేహాలు, కాలేజీ వరకు కొనసాగకపోవచ్చు. కాలేజీ ఫ్రెండ్స్ ఉద్యోగ జీవితం వచ్చేసరికి ఉండకపోవచ్చు. మరి స్నేహితులు విడిపోకుండా ఉండాలంటే.. స్నేహాల్ని నిలబెట్టుకోవాలంటే..!?

## అవసరాల కోసం కాదు

ఇద్దరు స్నేహితుల్లో ఒకరికి ఏ అవసరం వచ్చినా మరొకరు సాయం చేయడం మామూలే. కానీ కొందరు అవసరాల కోసమే స్నేహం చేస్తుంటారు. కొందరు.. అవసరం ఏర్పడొచ్చు అని తెలిశాక రోజూ ఫోన్ చేసి పలకరిస్తుంటారు. ఇంకొందరు అయితే అవసరం ఏర్పడినప్పుడు మాత్రమే ఫోన్ చేస్తారు. అలాంటి వాళ్లు అవసరం తీరాక స్నేహితుల్ని మళ్లీ పట్టించుకోరు. అలాంటి స్నేహాలు ఎక్కువకాలం నిలబడవు. స్నేహాలను నిలబెట్టుకోవాలంటే మనుషుల మధ్య అవసరాలతో కూడిన రిలేషన్ ఉండకూడదు.

అవసరం ఉన్నా, లేకపోయినా ఎప్పుడూ ఒకే విధంగా ఉండాలి. అవసరం ఉందని గుర్తించి ముందే నిజమైన స్నేహితులు హెల్ప్ చేస్తారు. అందుకే స్వచ్ఛమైన స్నేహితుల మధ్య అవసరాలు అనే అవకాశం రాదు. సాయం చేయలేకపోతే, సాయం చేసేందుకు అవసరమైన దారినైనా చూపిస్తారు. కేవలం అవసరాలకోసమే చేసే ఫ్రెండ్‌షిప్ ఎక్కువకాలం కొనసాగదు.

## విమర్శలు వద్దు

స్నేహితుల మధ్య సలహాలు, సూచనలు మాత్రమే ఉంటాయి. విమర్శలు ఉండవు. కానీ కొందరు ఆధిక్యతను ప్రదర్శించుకోవడానికి తనతో ఉన్న వాళ్లను విమర్శిస్తుంటారు. ఇంకొందరైతే స్నేహితులుగా ఉంటూనే మరొకరి దగ్గర విమర్శిస్తుంటారు. లోపాలను ఎత్తిచూపి, తక్కువ చేసి మాట్లాడుతుంటారు. ఇలాంటి వాళ్లు ఎవరితోనూ ఎక్కువకాలం స్నేహాలు కొనసాగించలేరు. వాళ్ల నిజ స్వరూపం బయట పడగానే నమ్మిన స్నేహితులు కూడా దూరమైపోతారు. అందుకే ఫ్రెండ్స్ మధ్య విమర్శలు అసలు ఉండకూడదు. సరదా కబుర్ల మధ్య ఒకరి మీద మరొకరు జోక్స్ వేసుకోవచ్చు. కానీ అవే మితిమీరితే మాత్రం ఆ స్నేహం చెడిపోవచ్చు. అందుకే స్నేహం నిలబడాలంటే విమర్శలకంటే తోటి ఫ్రెండ్స్‌ను ప్రోత్సహించడమే ముఖ్యం.

## అహం పనికిరాదు

నాకు ఎక్కువ మార్కులు వస్తాయి. నేను అందరికంటే తెలివి కలవాడ్ని. నాకు ఎక్కువ జీతం. నాకు ఎక్కువ ఆస్తులున్నాయి. ఇలాంటి అహంకారం స్నేహితుల మధ్య అసలు పనికిరాదు. అహంకారం ఉంటే ఇతరులతో కలవలేరు. తోటి స్నేహితులను తనతో సమానంగా చూడలేరు. ఆధిక్యం ప్రదర్శిస్తుంటారు. అందువల్ల ఎవరూ మనఃస్ఫూర్తిగా ఇలాంటి వాళ్లతో స్నేహం చేయలేరు. అవసరాలకోసం, సహాయం చేస్తాడనే ఆశతో కొందరు స్నేహం చేసినా ఎక్కువకాలం నిలవదు. డబ్బు, అధికారం ఏవి ఉన్నా, అవన్నీ స్వచ్ఛమైన స్నేహం ముందు బలాదూరే. అందుకే స్నేహం ఎక్కువకాలం నిలబడాలంటే, నేను, నాది అనే ఆలోచనల్ని వదిలేసి, స్నేహితులతో కలిసిపోవాలి.

## సీక్రెట్స్ కాపాడాలి

మంచి స్నేహితులు సంతోషం, బాధ, సీక్రెట్స్.. అన్నీ పంచుకుంటారు. మనసు విప్పి మాట్లాడుకుంటారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు వచ్చినప్పుడు, ఎటూ తేల్చుకోలేని సంఘటనలు ఎదురైనప్పుడు ఆత్మీయ మిత్రులనే సలహా అడిగి తీసుకుంటారు. వాళ్ల జీవితంలోని ప్రతి దాన్ని షేర్ చేసుకుంటారు. ఒకరిలోని లోపాలు, మంచితనం గురించి కచ్చితంగా తెలియాలంటే, వాళ్ల స్నేహితుల్ని అడగమని చెప్పేది అందుకే. కానీ కొందరు స్నేహితులు చెప్పిన మాటలను మరొకరికి షేర్ చేస్తుంటారు. అలాంటి వాళ్లతో స్నేహం చేయడం చాలా డేంజర్. రహస్యాలు కాపాడని స్నేహాలు ఎక్కువకాలం నిలబడవు. స్నేహాలు నిలబడాలంటే తప్పని సరిగా ఒకరి రహస్యాలు ఒకరు కాపాడాల్సిందే.



## ఇవి తప్పనిసరి

స్నేహాలు ఎక్కువకాలం కొనసాగించాలంటే, ఎదుటి వ్యక్తులే కాదు ఎవరికి వాళ్లు కూడా నిజాయితీగా ఉండాలి. అందుకోసం కొన్ని సూత్రాలు పాటించాలి.

- మాటలు, చేతల్లో ఎదుటి వాళ్లు ఎంత ప్రాముఖ్యమో తెలియజేయాలి. అందుకోసం బాధలు, విజయాలు, కష్టాలు, సంతోషాలు.. తప్పనిసరిగా పంచుకోవాలి.
- స్నేహితులు ఏ పరిస్థితిలో ఉన్నారో గమనిస్తూ ఉండాలి. భావోద్వేగాలను గుర్తించి వాళ్ల సాదకబాధకాలు అంచనా వేయాలి. మనసులో మాటలను వినాలి. ఒంటరిగా ఉన్నామనే ఆలోచన వాళ్లకు రానివ్వకూడదు.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఎవరి పనుల్లో వాళ్లు బిజీ బిజీగా గడుపుతున్నారు. ఎంత బిజీగా ఉన్నా తప్పనిసరిగా స్నేహితులకోసం సమయం కేటాయించాలి.
- ఆప్త మిత్రులను ఎట్టి పరిస్థితుల్లోనూ దూరం చేసుకోకూడదు. వాళ్లకు ఎలాంటి అవసరాలు ఉన్నాయో తెలుసుకుని చేతనైన సాయం చేయాలి.
- స్నేహితుల అభిప్రాయాలు, ఆలోచనలను గుర్తించాలి. వాటికి విలువ ఇవ్వాలి. గౌరవించాలి. ఎప్పుడూ నమ్మకాన్ని పోగొట్టుకోకూడదు.

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org